
ఎన్నారైలో ఆస్పత్రిలో వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ అనిల్‌కుమార్


టిడ్కో గృహాల్లో వృద్ధురాలికి పెన్షన్ పంపిణీ చేస్తున్న వలంటీర్


టిడ్కో ఇంట్లో లబ్ధిదారుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్


లాంలో దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్ కుమార్


పెదకూరపాడులోపక్షవాత బాధితుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

తొలిపొద్దునే పింఛన్

మంగళగిరి: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీని వలంటీర్లు బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. టిడ్కో ఇళ్లల్లో పెన్షన్లు అందజేశారు. ఎన్నారైలో చికిత్స పొందుతున్న రోగికి పెదవడ్లపూడి వలంటీర్ అనిల్ కుమార్ ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు.

తాడికొండ: తుళ్ళూరు మండలం బోరుపాలెం, తాడికొండ మండలం లాం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సామాజిక పింఛనను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. వలంటీర్ ముక్కెర పార్వతి, 11వ వార్డు మెంబర్ ముక్కెర శ్రీనివాసరావు పెదకూరపాడు గ్రామానికి వెళ్లి పింఛన్ అందజేశారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని క్రీస్తునగర్ 9వార్డులో కత్తెర సురేష్‌కుమార్ హాజరై పింఛన్లు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

కేఎల్‌యూలో ముగిసిన సాంకేతిక ఉత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో సాంకేతిక ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల ఏఆర్ డీఎస్పీ మంగళగిరి ప్రేమ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవరచుకోవాలని అన్నారు. లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సి.ఇ.వో. వేములపల్లి రవికిరణ్ యాంత్రిక సాంకేతిక ఉత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, కేఎల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రామకృష్ణ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

తాడేపల్లి రూరల్: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. సీపీఎం సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, శివన్నారాయణ, సీపీఐ నాయకులు కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే ఆర్కే
- వడ్డేశ్వరం- కొలనుకొండలో అభివృద్ధి పనులు పరిశీలన


కొలనుకొండలో సమస్యలపై స్థానిక నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం-కొలనుకొండలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) బుధవారం విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రెండు గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులను చేపట్టినట్లు వెల్లడించారు. రాబోయే వేసవికి తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా కృషి స్తున్నామని చెప్పారు. అనంతరం జెడ్పీ పాఠశాలలోని నాడు నేడు పనులను పరిశీలించి పేరెంట్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. అక్షయ పాత్ర వారు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈఈలు కిషోర్, ప్రవీణ్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక మల్లికార్జునరావు(బుల్లబ్బాయి), పార్టీ వడ్డేశ్వరం, కొలనుకొండ కన్వీనర్లు గొడవర్తి శ్రీనివాసరావు, నూతక్కి శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో చిరు వ్యాపారం చేసుకునే వారికి ఎమ్మెల్యే ఆర్కే తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దుగ్గిరాల మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కూరగాయలు, పండ్లు, ఇతర వ్యాపారాలు చేసేవారు తట్టల్లో, సైకిళ్ల మీద అమ్ముకుంటున్నారని వారికి చేదోడుగా ఉండేందుకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, దుగ్గిరాల సర్పంచి బాణావత్ ఖుషీబాయి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, మోరంపూడి సర్పంచి ఇత్తడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సతీష్, నాయకులు కంభంపాటి క్రాంతి కుమార్, ఆత్మకూరి నాగేశ్వరరావు, నాగూర్ పాల్గొన్నారు.

వితంతు మహిళ ఇంటి నిర్మాణానికి సహాయం

వడ్డేశ్వరంలో వితంతు మహిళ తనకున్న స్థలంలో పట్టాలు కప్పుకుని నివాసాన్ని ఏర్పాటు చేసుకుంది. గమనించి ఎమ్మెల్యే ఆర్కే ఆమె వివరాలు తీసుకుని ఆమె ఇంటి నిర్మాణం కోసం రూ.25 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు.

పూర్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ అనుసంధానంగా ఉన్న పీడబ్ల్యూడీ వర్క్‌షాప్‌లో పనిచేసిన పూర్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. విశ్రాంత సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ వెల్లంకి రామదాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జనరల్ సూపరింటెండెంట్ జె.గుణకరరావు, రిటైర్డ్ ఆపరేటర్ ఎ.వి.రాఘవులు పాల్గొన్నారు.

వినూత్న ప్రయోగాలతో మనోవికాసం

ఫిరంగిపురం: వినూత్నప్రయోగాలద్వారా విద్యార్థుల మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని బాల ఏసుదేవాలయ విచారణగురువులు పామిశెట్టి బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్‌ఆన్స్ కరస్పాండెంట్ సిస్టర్ ఆరోగ్యమేరి, ప్రిన్సిపాల్ కె.నిర్మలామేరి పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థులకు మంచి భవిష్యత్

మంగళగిరి: ఉర్దూ భాషకు మంచి భవిష్యత్ ఉందని, కాబట్టి ప్రతి పాఠశాలలో ఉర్దూ తప్పక బోధించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి డి.ఖాసిం పేర్కొన్నారు. నగర పరిధిలోని నూతక్కి, పెదవడ్లపూడిలోని మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలో బుధవారం ఎంఈఓ జి.సత్యనారాయణతో కలసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం, నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు రూపొందించుకుని బోధన చేయాలని, విద్యార్థులు నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్ క్రమం తప్పకుండా పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, ఆయేషా సిద్ధిఖీ, నూరుద్దీన్ పాల్గొన్నారు.

జయ నాగశ్రీకి గోల్డ్ మెడల్



మంగళగిరి: పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో మంగళగిరికి చెందిన అకురాతి జయ నాగశ్రీ కి 2018-20 విద్యా సంవత్సరంలో ఎమ్మెస్సీ స్టాటిటిక్స్ పూర్తి చేసి ఆ విభాగంలో గోల్డ్ మెడల్ అందుకుంది. యూనివర్సిటీలో మంగళవారం రాత్రి నిర్వహించిన కాన్వకేషన్ కార్యక్రమంలో పాండిచ్చేరి ప్రభుత్వ జిక్మార్ ఆస్పత్రి డైరెక్టర్ ఆకాష్‌కుమార్ చేతుల మీదుగా జయ నాగశ్రీ గోల్డ్ మెడల్ అందుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం జయ నాగశ్రీ, సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తోంది.

అనుమానాదాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు. ఆత్మకూరు నుంచి ఇప్పటం వెళ్లే దారిలో చెరువులో మృతదేహం ఉందని స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి 35-40 సంవత్సరాలు, ఆరెంజ్ కలర్ టీషర్టు మీద ఎస్‌పీఎం అని రాసి ఉందని, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్, నలుపురంగు కట్ బనియన్, కుడిచేతికి ఇనుప కడియం ఉన్నాయని ఆయన తెలిపారు. తాడేపల్లి ఎస్‌ఐ వినోద్ కేసు నమోదు చేశారు.

వంటగ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం బసవతారక నగర్‌లోని ఓ నివాస గృహంలో వంట గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వాషింగ్ మెషీన్, విద్యుత్ మీటరు దగ్ధం కాగా ఓ వృద్ధుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణ పోరాటం మృతి చెందిన 12 మంది అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని బాబూ జగ్జీవనరామ్ విగ్రహం వద్ద బుధవారం మృతి చెందిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కలకోటి నాగేశ్వరరావు, చందోలు విక్టర్ పాల్, నన్నేపల్లి రాజేష్ పాల్గొన్నారు.